1st Year
Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
RNI : APTEL / 2023 / 89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 03 సంచిక : 153    బుధవారం 10 జూన్ 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

# ‘మమ్మల్ని కాదు, ఫ్యాక్టరీని కాపాడండి’..



**క్షతగాత్రుడి మాటలతో కదిలిపోయాను: మంత్రి లోకేష్**

**విశాఖ స్టీల్ ప్లాంట్ లో ఘోర ప్రమాదం**

**విశాఖలో మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను పరామర్శించిన లోకేష్**

**మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, శాశ్వత ఉద్యోగం హామీ**

**కేంద్ర మంత్రి కుమారస్వామి, రాష్ట్ర మంత్రి లోకేష్ పరామర్శ**

**ప్రమాద కారణాలపై ముగ్గురు సభ్యులతో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు**

**ఉక్కు కర్మాగారాన్ని కాపాడాలంటూ ఆసుపత్రిలో క్షతగాత్రుడి విజ్ఞప్తి**

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 09)**

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో చోటుచేసుకున్న ఘోర ప్రమాదంలో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు, క్షతగాత్రులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి నారా లోకేష్ ప్రకటించారు. బాధితులను పరామర్శించిన అనంతరం నారా లోకేష్ మీడియాతో మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం కల్పిస్తున్న భరోసాను వివరించారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా, కాంట్రాక్ట్ లేదా పర్మనెంట్ అనే తేడా లేకుండా మృతుల కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పిస్తామని ప్రకటించారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి ▶మిగతా 2లో

## ఏఐ ప్రాణాంతక ముప్పు కాదు.. ఐటీకి ఎన్నడూ లేని అవకాశం: టీసీఎస్ చైర్మన్



**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 09)**

ఐటీ రంగంపై కృత్రిమ మేధ ప్రభావం గురించి నెలకొన్న ఆందోళనల నేపథ్యంలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఏఐ ప్రాణాంతకమైన ముప్పు కాదని, అదొక అవకాశమని వెల్లడించారు. సంస్థ 31వ వార్షిక సర్వసభ్య సమావేశంలో వాటాదారులతో తాజాగా ఆయన మాట్లాడారు.ఏఐతో ప్రపంచ టెక్నాలజీ మార్కెట్ విస్తరించడానికి సిద్ధంగా ఉందని, ఐటీ రంగానికి కొత్త వ్యాపార అవకాశాలు వస్తాయని చంద్రశేఖరన్ ఆశాభావం వ్యక్తంచేశారు. “ప్రస్తుతం ఐటీ మోడల్‌కు ఏఐ ప్రాథమిక ముప్పు అని కొందరు చెబుతున్నారు. కానీ నేను ఈ పరిస్థితులను భిన్నంగా చూస్తున్నాను. ▶మిగతా 2లో



## స్టీల్ ప్లాంట్ ఘటన.. పరిహారం ప్రకటించిన పవన్ కల్యాణ్

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 09)**

విశాఖపట్నం: స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో 8 మంది చనిపోవడం బాధాకరమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మృతుల కుటుంబాలకు రూ.25లక్షల చొప్పున పరిహారంతో పాటు ఉద్యోగం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. క్షతగాత్రులకు రూ.10లక్షల చొప్పున పరిహారం అందిస్తామన్నారు.“భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. రక్షణ చర్యల పట్ల యాజమాన్యం ఎలా ఉందో పూర్తిగా తెలుసుకోవాలి. ప్రమాద ఘటనపై కమిటీ విచారణ జరిపి నివేదిక ఇచ్చాక తదుపరి ▶మిగతా 2లో

## స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కుట్రల వల్లే ప్రమాదాలు

**విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో ఎనిమిది మంది చనిపోవడం బాధాకరమన్న బొత్స**

**బాధితులు కోరుతున్న పరిహారం ఇవ్వాలని వ్యాఖ్య**

**మృతుల కుటుంబాలకు కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్**



**(షణ్ముఖ వెలుగు, విశాఖపట్నం,జూన్ 09)**

విశాఖ స్టీల్ ప్లాంట్ ఘోర ప్రమాదంలో గాయపడి కేజీహెచ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను వైసీపీ నేతలు బొత్స సత్యనారాయణ, కురసాల కన్నబాబు, కేకే రాజులతో కూడిన బృందం పరామర్శించింది. అనంతరం మీడియాతో బొత్స మాట్లాడుతూ... ఈ ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు చనిపోవడం అత్యంత బాధాకరమని అన్నారు. బాధితులు కోరుతున్న పరిహారం గొంతెమ్మ కోరిక కాదని, ప్రభుత్వం వారి డిమాండ్లను తక్షణమే అంగీకరించాలని చెప్పారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి స్టీల్‌ప్లాంట్‌ను తమ తాబేదార్లకు కట్టబెట్టేందుకు, ప్రైవేటీకరణ ▶మిగతా 2లో

## స్టీల్ ప్లాంట్ బాధితులకు మంత్రి లోకేశ్ పరామర్శ.. అండగా ఉంటామని భరోసా

**విశాఖ కేజీహెచ్‌కు వెళ్లిన మంత్రి నారా లోకేశ్**

**స్టీల్ ప్లాంట్ ప్రమాద మృతుల కుటుంబాలకు పరామర్శ**


**ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ**

**ప్రమాదంపై కమిటీ నివేదిక తర్వాత చర్యలని వెల్లడి**



**(షణ్ముఖ వెలుగు, విశాఖపట్నం,జూన్ 09)**

అందరి పోరాటంతోనే స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకున్నామన్న లోకేశ్ విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలను రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పరామర్శించారు. ఇవాళ ఆయన విశాఖ కేజీహెచ్‌కు వెళ్లి, బాధితుల కుటుంబ సభ్యులను కలిసి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాదం జరిగిన తీరును ▶మిగతా 2లో



## 3 నెలల్లో 37వ సారి.. డీల్‌పై ట్రంప్ ప్రకటనల లెక్క..

**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 09)**

‘ఇరాన్‌తో ఒప్పందానికి దగ్గరగా ఉన్నాం.. అతిత్వరలోనే డీల్ కుదురుతుంది’.. దాదాపు రెండున్నర నెలల కిందట అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పిన మాట ఇది. అప్పటి నుంచి ఆయన ఇదే విషయాన్ని పలుమార్లు వెల్లడిస్తున్నా.. ఒప్పందం మాత్రం ఖరారు కాలేదు సరికదా.. ఉద్రిక్తతలు ఇంకా పెరుగుతూనే ఉన్నాయి. అయితే, ట్రంప్ ఇలా డీల్ గురించి ఎన్నిసార్లు ప్రకటనలు చేశారో తెలుసా? మూడు నెలల్లో 37 సార్లు..!

ఫిబ్రవరి 28న ఇరాన్ పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ▶2లో




## డీఎస్సీలో అవకతవకలు జరిగితే 39 పోస్టుల్ని ఎందుకు ఖాళీగా ఉంచుతారు?

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 09)**

డీఎస్సీ క్రీడా కోటా నియామకాల్లో అవకతవకలు జరిగితే 39 పోస్టుల్ని భర్తీ చేయకుండా ఎందుకు ఖాళీగా ఉంచుతారని వైకాపా నేతల్ని తెదేపా ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ప్రశ్నించారు. క్రీడా కోటా నియామకాల మీద అనుమానాలు రేకెత్తించడం, వారు ఆ పోస్టులకు పనికిరారని విమర్శలు చేయడం యావత్తు క్రీడా లోకాన్ని అవమానించడమేనని మండిపడ్డారు. మంత్రి టీజీ భరత్, తెదేపా ఎమ్మెల్యే కూన రవికుమార్‌ల మీదా వైకాపా నాయకులు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రవికుమార్ ఈ ఏడాది జనవరిలో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్‌కు అధ్యక్షుడైతే అంతకు ముందు జరిగిన వ్యవహారాలతో ఆయనకేం ▶మిగతా 2లో

## పాక్‌ది కపట వైఖరి.. ఐరాసలో భారత్



**(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ, జూన్ 09)**

ఉగ్రవాద నిరోధక చర్య అనే ముసుగులో.. అఫ్గానిస్థాన్‌పై పాకిస్థాన్ చేపట్టిన సైనిక చర్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. వైమానిక దాడులతో అమాయక ప్రజలను బలిగొనడాన్ని తప్పుబట్టింది.

అఫ్గానిస్థాన్‌లోని ప్రస్తుత పరిస్థితులపై ఐరాస భద్రతామండలిలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఐరాసలోని భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ మాట్లాడుతూ.. ‘ఒక మారణహోమాన్ని పాక్ సైనిక చర్యగా చిత్రీకరిస్తోంది. పౌరులను చంపడం, వారిని గాయపరచడం.. పసిపిల్లలను అనాథలు చేయడాన్ని ఉగ్రవాద నిరోధక చర్యలు అంటారా ? ఓవైపు అంతర్జాతీయ చట్టాన్ని పాటించాలంటూనే.. పవిత్రమైన రంజాన్ మాసంలో అఫ్గాన్‌పై వైమానిక దాడులు చేసింది. ఇది పాక్ కపటత్వానికి నిదర్శనం’ అని పేర్కొన్నారు. ఇదే సమయంలో.. ▶మిగతా 2లో

## నేడు విశాఖ వెళుతున్న జగన్..



**(షణ్ముఖ వెలుగు, విశాఖపట్నం,జూన్ 09)**

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతిని రేకెత్తించింది. ఈ దారుణ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలను, అలాగే గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించేందుకు వైసీపీ అధినేత జగన్ రేపు విశాఖలో పర్యటించనున్నారు.

ఈ ప్రమాదంపై జగన్ ఇప్పటికే తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఘటన జరిగిన వెంటనే ఆయన స్పందిస్తూ... బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్య సహాయం అందేలా చూడాలని స్థానిక వైసీపీ నాయకులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు తన గాఢ సానుభూతిని తెలియజేశారు. బాధిత కుటుంబాలకు పార్టీ శ్రేణులు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని సూచించారు. నిన్న సాయంత్రం స్టీల్‌ప్లాంట్‌లో ఒక పెద్ద పేలుడు సంభవించింది. 150 టన్నుల లాడిల్ నుండి కరిగిన ఉక్కు ఒక్కసారిగా కిందపడటంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో తొమ్మిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోగా... మరో ఆరుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం వారు నగరంలోని వివిధ ఆసుపత్రుల్లో అత్యవసర చికిత్స పొందుతున్నారు. వీరిలో ఇద్దరి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం.

# విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదం అత్యంత బాధాకరం

**టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గోగినేని రామారావు**



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 9)**

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంలో పలువురు కార్మికులు మరణించడం అత్యంత విషాదకరమని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గోగినేని రామారావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు టీఎన్‌టీయూసీ తరఫున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చేకూరాలని ఆకాంక్షించారు. అలాగే ప్రమాదంలో గాయపడిన కార్మికులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించి, వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్మికుల భద్రతకు మించిన ప్రాధాన్యత మరొకటి లేదని పేర్కొన్న ఆయన, భవిష్యత్తులో ఇటువంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా స్టీల్ ప్లాంట్ యాజమాన్యం పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు. ముఖ్యంగా సేఫ్టీ ఆడిట్లను నిరంతర ప్రక్రియగా నిర్వహిస్తూ, కార్మికులకు అవసరమైన భద్రతా పరికరాలు మరియు శిక్షణను అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ప్రమాదం జరిగిన తర్వాత విచారం వ్యక్తం చేయడం మాత్రమే కాకుండా, వాటి పునరావృతాన్ని నివారించే చర్యల పై దృష్టి పెట్టాలని సూచించారు. కార్మికుల ప్రాణ భద్రతను కాపాడే విధంగా సమగ్ర భద్రతా విధానాలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి బాధిత కుటుంబాలకు అండగా నిలిచిన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ లకు టీఎన్‌టీయూసీ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. చివరగా కార్మికుల సంక్షేమం, భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని, ఇటువంటి విషాదకర సంఘటనలు మళ్లీ జరగకుండా అన్ని స్థాయిల్లో చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# కనిగిరి డిపోలో యోగాంధ్ర కార్యక్రమం






**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 9)**

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రత్యేక "యోగాంధ్ర" కార్యక్రమంలో భాగంగా మంగళవారం కనిగిరి పురపాలక సంఘం, ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ, ప్రజా రవాణా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కనిగిరి ఆర్‌టిసి డిపో నందు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. యోగ గురువు గురుస్వామిరెడ్డి యోగాసనాలు చేయించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మహమ్మద్ సయనా బేగం, శానిటరీ ఇన్స్పెక్టర్ నాయబ్ రసూల్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతికి, జీవన విధానానికి యోగా ప్రతీక అని, యోగాసనాల ద్వారా అనారోగ్యాలు, మానసిక సమస్యలకు దూరంగా ఉండొచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి, మున్సిపాలిటీ, సచివాలయం, మోప్మా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**మొదటి పేజీ తరువాయి**

## 'మమ్మల్ని కాదు, ఫ్యాక్టరీని కాపాడండి'..

ప్రకటించిన వివరాలను లోకేష్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం తరఫున అదనంగా రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రతి కుటుంబానికి అందిస్తున్నట్లు తెలిపారు. నిన్న రాత్రి ఘటనా స్థలాన్ని సందర్శించిన కుమారస్వామి, ఈ మేరకు హామీ ఇచ్చారని చెప్పారు. కుటుంబంలో చదువుకున్న వారికి పర్మనెంట్ ఉద్యోగం ఇవ్వడంపై కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి నిబంధనల గురించి ప్రస్తావించగా, "అవసరమైతే కేబినెట్‌కు తీసుకెళ్లైనా దీన్ని సాధిస్తాను, ఇది నా బాధ్యత" అని కుమారస్వామి స్పష్టం చేశారని లోకేష్ వివరించారు. ప్రభుత్వం కేవలం హామీలు ఇచ్చి చేతులు దులుపుకోదని, బాధితులకు శాశ్వతంగా అండగా నిలుస్తుందని లోకేష్ స్పష్టం చేశారు. "నిన్న సాయంత్రం 4:10 గంటలకు ప్రమాదం జరగగానే కలెక్టర్, సీపీ ఘటనా స్థలానికి చేరుకున్నారు. హోం మంత్రి అనిత, ఎంపీ శ్రీభరత్, పల్లా శ్రీనివాస్ కూడా వచ్చారు. కేంద్ర మంత్రులు కుమారస్వామి, వర్మ కూడా వెంటనే స్పందించి పరిస్థితిని సమీక్షించారు. కుమారస్వామి గారు ఇచ్చిన ఆదేశాల మేరకు, ఈరోజు తేదీ మారేలోపే 8 మంది మృతుల కుటుంబాల అకౌంట్లలోకి తక్షణ సాయంగా రూ.25 లక్షలు జమ చేస్తాం. దీనితో పాటు పీఎఫ్, స్టీల్ ప్లాంట్ నిబంధనల ప్రకారం రావాల్సిన మిగతా పరిహారం కూడా త్వరలోనే అందిస్తాం" అని తెలిపారు. ప్రమాదం జరిగిన తీరుపై లోతైన దర్యాప్తు జరుగుతుందని లోకేష్ అన్నారు. "ఇది కింద నుంచి లీకవ్వలేదు, పైనుంచి పొంగలేదు. ద్రవ ఉక్కు బయటకు కక్కినట్లుగా ఉంది. దీని వెనుక కారణాలను నిగ్గు తేల్చేందుకు ముగ్గురు సీనియర్ అధికారులతో ఉన్నతస్థాయి కమిటీని వేశారు. వారు ఈరోజే విశాఖ వచ్చి కార్మికులతో మాట్లాడి నివేదిక సమర్పిస్తారు. నివేదిక ఆధారంగా కఠిన చర్యలు ఉంటాయి" అని వివరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో జరిగిన ఓ సంఘటనను లోకేష్ ఉద్వేగంగా పంచుకున్నారు. "గాయపడిన శ్రీనివాస్ అనే కార్మికుడిని పరామర్శిస్తే, ఆయన తన ఆరోగ్యం గురించి కాకుండా 'అయ్యా, మమ్మల్ని కాదు, దయచేసి విశాఖ ఉక్కును కాపాడండి. లక్షలాది కుటుంబాలు దీనిపై ఆధారపడి ఉన్నాయి' అని వేడుకున్నాడు. ఆ మాటలు కార్మికులకు ఫ్యాక్టరీతో ఉన్న అనుబంధాన్ని తెలియజేశాయి. ఆయన మాటలు నన్ను కదిలించాయి" అని అన్నారు.

గతంలో వాజ్‌పేయి, చంద్రబాబు హయాంలో రూ.15 వేల కోట్ల ప్యాకేజీతో ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకున్నామని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా కార్మికుల కుటుంబాలకు అదే విధంగా ఎన్డీయే ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఉత్తరాంధ్రకు రానున్న భారీ పెట్టుబడుల నేపథ్యంలో నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని, యువతకు శిక్షణ ఇచ్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని లోకేష్ హామీ ఇచ్చారు.

## స్టీల్ ప్లాంట్ ఘటన.. పరిహారం ప్రకటించిన పవన్ కల్యాణ్

నిర్ణయాలు ఉంటాయి. ఒక కోణంలో కాదు.. అన్ని వైపులా వివరాలు సేకరిస్తే విషయం తెలుస్తుంది. ఇలాటి దుర్ఘటనలు జరిగినప్పుడు బాధపడటం కాదు.. పునరావృతం కాకుండా చూడాలి. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకూడదనేది ప్రధాన సంకల్పం. ప్రభుత్వ స్టీల్‌ప్లాంట్‌గా ఉండాలనేది అందరి ఆకాంక్ష.. అలాగే కొనసాగిస్తాం. స్టీల్ ప్లాంట్ కార్మికుల సమస్యలను వారి నుంచే అడిగి తెలుసుకుంటాం. ఒక సమావేశం ఏర్పాటు చేసి కార్మికుల సమస్యలు తెలుసుకుంటాం" అని తెలిపారు.

## పాక్‌ది కపట వైఖరి.. ఐరాసలో భారత్

ఉగ్రవాదులకు మద్దతిస్తూ భారత్‌పై నిందలు వేసేందుకు పాక్ చేసిన అన్ని ప్రయత్నాలను తిప్పికొట్టారు. దాయాది దేశంలోని రాజకీయ వ్యవస్థను, అక్కడి పరిపాలనలో సైన్యం పాత్రను కూడా ప్రశ్నించారు. కాగా.. ఈ ఏడాది ప్రారంభంలో పాక్- అఫ్గాన్ మధ్య సరిహద్దు ఘర్షణలు తీవ్రమయ్యాయి. రంజాన్ మాసంలో కాబుల్‌లోని ఓ ఆస్పత్రిపై పాక్ వైమానిక దాడి చేసింది. ఈ ఘటనలో 269 మంది ప్రాణాలు కోల్పోగా.. మరో 122 మంది గాయపడ్డారు. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య తాత్కాలిక కాల్పుల విరమణ కొనసాగుతున్నప్పటికీ.. సరిహద్దు వెంట హింస చెలరేగుతూనే ఉంది.

## స్టీల్ ప్లాంట్ బాధితులకు మంత్రి లోకేశ పరామర్శ.. అండగా ఉంటామని భరోసా

అడిగి తెలుసుకుని, ధైర్యంగా ఉండాలని వారికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ వెంట కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, మంత్రి సంధ్యారాణి, ఎంపీ శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, చింతకాయల విజయ్ తదితరులు ఉన్నారు. బాధిత కుటుంబాలను పరామర్శించిన అనంతరం మంత్రి లోకేశ్ మీడియాతో మాట్లాడారు. "బాధిత కుటుంబాలకు అండగా ఉండేందుకే కేంద్ర, రాష్ట్ర ఎన్డీయే ప్రభుత్వ ప్రతినిధులుగా ఇక్కడికి వచ్చాం. ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా ఉంటాం. వారి కుటుంబాలకు జీవితాంతం తోడుగా నిలుస్తాం" అని హామీ ఇచ్చారు. ప్రమాదంపై ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక అందిన తర్వాత బాధ్యులపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అందరం కలిసికట్టుగా పోరాడటం వల్లే స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోగలిగామని ఈ సందర్భంగా లోకేశ్ గుర్తుచేశారు. కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ కూడా బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు.

## స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కుట్రల వల్లే ప్రమాదాలు

చేసేందుకే కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. ఈ కుట్రల వల్లే ప్లాంట్‌లో వరుస ప్రమాదాలు జరుగుతూ కార్మికుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయని ఆరోపించారు.

స్టీల్ ప్లాంట్ నుంచి సమర్థులైన, అనుభవజ్ఞులైన అధికారులను దొడ్డిదారిన బదిలీ చేయడం వల్లే ఈ భారీ ప్రమాదం చోటుచేసుకుందని బొత్స విమర్శించారు. ఇప్పటికే దాదాపు 10 వేల మంది శాశ్వత, కాంట్రాక్ట్ ఉద్యోగులను అన్యాయంగా తొలగించారని, ఇకనైనా బలవంతపు వీఆర్ఎస్ చర్యలను ఆపాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు 'ఎల్జీ పాలిమర్స్' తరహాలో కోటి రూపాయల చొప్పున పరిహారం ఇవ్వాలని, ఈ విషయంలో వైసీపీ రాజీలేని పోరాటం చేస్తుందని తేల్చి చెప్పారు. అలాగే, బాధితులను పరామర్శించేందుకు జగన్ రేపు విశాఖలో పర్యటిస్తారని వెల్లడించారు.

## 3 నెలల్లో 37వ సారి.. డీల్‌పై ట్రంప్ ప్రకటనల లెక్క..

ఈ క్రమంలోనే యుద్ధం ముగింపునకు శాశ్వత శాంతి ఒప్పందం కోసం ఇరాన్‌ను ట్రంప్ చర్చలకు ఆహ్వానించారు. ఆ సమయంలో మార్చి 23న ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. శాంతి చర్చల్లో చాలా అంశాలపై ఏకాభిప్రాయం కుదిరిందన్నారు. ఆ తర్వాత క్యాబినెట్ సమావేశంలో ప్రసంగిస్తూ.. అమెరికాతో ఒప్పందం కోసం టెహ్రాన్ తీవ్రంగా అభ్యర్థిస్తోందని తెలిపారు. ఏప్రిల్ 6న మరోసారి దీనిపై మాట్లాడుతూ.. ఇరాన్‌తో ఒప్పందానికి చాలా దగ్గరగా ఉన్నామని అన్నారు. ఆ మరుసటిరోజే ఇరుదేశాల మధ్య తాత్కాలిక కాల్పుల విరమణకు అంగీకారం కుదిరింది. తొలుత రెండు వారాల పాటు ఈ కాల్పుల విరమణ చోటుచేసుకోగా.. ఆ తర్వాత దాన్ని మరికొంతకాలం పొడిగించారు. మరోవైపు, శాంతి చర్చల కోసం ఇరుదేశాల మధ్య చర్చలు కొనసాగాయి. అలా మొత్తంగా ఇప్పటివరకు ట్రంప్ 37 సార్లు డీల్ కుదుర్చుకునేందుకు చాలా దగ్గరగా వచ్చామని ప్రకటన చేసినట్లు మీడియా గణాంకాలు చెబుతున్నాయి. అయితే, ఇరాన్ మాత్రం ఎప్పటికప్పుడు అమెరికా అధ్యక్షుడి ప్రకటనలను కొట్టి పారేస్తూనే ఉంది. అగ్రరాజ్య డిమాండ్లను తాము అంగీకరించట్లేదని, ఒప్పందంలో ఏ అంశాల పైనా ఏకాభిప్రాయం కుదరలేదని టెహ్రాన్ చెబుతోంది. దీంతో ట్రంప్ ప్రకటనలపై ప్రజల్లో ఆసక్తి తగ్గిపోయినట్లు కన్పిస్తోంది. ఇదిలాఉండగా.. ఓవైపు శాంతిఒప్పందం కోసం అమెరికా ప్రయత్నిస్తుండగా పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులకు ప్రతీకారంగా ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడింది. దీంతో ఇజ్రాయెల్ తీవ్రంగా ప్రతిస్పందించింది. ఇరుపక్షాలూ కాల్పులను తక్షణమే ఆపాలని ట్రంప్ పిలుపునిచ్చినా.. పరిస్థితిలో ఏ మార్పు రాలేదు. తాజాగా అమెరికాకు చెందిన అపాచీ హెలికాప్టర్ ఒకటి హర్మూజ్ సమీపంలో కూలిపోవడం గమనార్హం.

## ఏఐ ప్రాణాంతక ముప్పు కాదు.. ఐటీకి ఎన్నడూ లేని అవకాశం: టీసీఎస్ ఛైర్మన్

ఐటీ రంగానికి ఇప్పటివరకు లభించని ముఖ్యమైన అవకాశం అని భావిస్తున్నాను. ప్రస్తుతం టీసీఎస్ భారీగా ఏఐ ఏజెంట్లను అభివృద్ధి చేస్తోంది. కంపెనీలో ఉద్యోగులు, ఏఐ ఏజెంట్లు సమాన సంఖ్యలో ఉండేరోజు ఎంతో దూరంలో లేదు" అని పేర్కొన్నారు.

**గతంలో మాదిరిగా నియామకాలు ఉండవు..**

"మనుషులు చేసే కొన్ని పనులను ఏఐ ఏజెంట్లు చేయడం మొదలుపెట్టాయి. అందుకే టీసీఎస్ గతంలో మాదిరిగా భారీ ఎత్తున నియామకాలు చేపట్టదు. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, వ్యాపార కార్యకలాపాల్లో కృత్రిమ మేధ భాగం అవుతుండటంతో.. నియామకాల విషయంలో మార్పు ఒక్క టీసీఎస్‌కే పరిమితం కాదు. అదే సమయంలో ఉద్యోగులను తగ్గించుకునే ప్రణాళికలు టీసీఎస్‌కు లేవు. ఉద్యోగులు, ఏజెంట్లు కలిసి పనిచేయడం మరింత పెరుగుతుంది. దాంతో కొత్త నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతుంది. అలాగే గత నాలుగు త్రైమాసికాలుగా సంస్థ ఏఐ ఆదాయం స్థిరంగా పెరుగుతూ వస్తోంది" అని చంద్రశేఖరన్ వెల్లడించారు

## డీఎస్సీలో అవకతవకలు జరిగితే 39 పోస్టుల్ని ఎందుకు ఖాళీగా ఉంచుతారు?

సంబంధమని నిలదీశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఇద్దరు నేతలు కలిసి విలేకరులతో మాట్లాడారు. 'సర్టిఫికెట్ వెరిఫికేషన్ అంటే కూడా తెలియని అజ్ఞానంలో వైకాపా నేతలున్నారు. అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీని రద్దు చేస్తామంటూ వాళ్లు అత్యంత దుర్మార్గంగా మాట్లాడుతున్నారు' అని శ్రీకాంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మెగా డీఎస్సీలో అవకతవకలు జరిగాయని నిరూపిస్తే తాను రాజీనామాకు సిద్ధమని రాంగోపాల్‌రెడ్డి సవాలు చేశారు. ఈ వ్యవహారం మీద ఎక్కడైనా వైకాపా నేతలతో చర్చకు సిద్ధమని తెలిపారు.

# సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకం

**మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి**



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 9)**

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి మార్కాపురం పట్టణంలోని జడ్పీ బాయ్స్ హై స్కూల్ లో జరుగుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఫౌండేషన్ లీటరసీ న్యూమరసీ శిక్షణ తరగతులకు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకటి మరియు రెండవ తరగతుల విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయులకు ఈ శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయని తద్వారా 1, 2 తరగతి విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించవచ్చన్నారు. మన మార్కాపురం నియోజకవర్గంలో గొట్లగట్టు జడ్పీ హైస్కూల్ విద్యార్థి 592 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల సత్తా చాటారని ఆ స్కూల్ హెడ్మాస్టర్‌కి ఈ నెల 19వ తేదీ జరగనున్న మెగా పేరెంట్స్ డే మీటింగ్ రోజున లక్ష రూపాయలు ప్రోత్సాహంగా అందజేస్తానని అన్నారు. అదే విధంగా 580 మార్కులు దాటిన వారికి కూడా ఆ స్కూలుకు వెళ్లి త్వరలో ప్రోత్సాహక బహుమతులు అందజేస్తానన్నారు. సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయులు పాత్ర ఎంతో కీలకమని, మంచి విద్యను అందించడం ద్వారా విద్యార్థులను ఉన్నత స్థానాల్లో నిలబెట్టవచ్చునని తద్వారా వారు ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడతారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





# ఉమెన్స్ ప్రో కబడ్డీ ఛాంపియన్‌షిప్‌కు ఎమ్మెల్యే కొండయ్యకు ఆహ్వానం

**(షణ్ముఖ వెలుగు, చీరాల, జూన్ 9)**

చీరాల రోటరీ క్లబ్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 10, 11, 12 తేదీల్లో ప్రతిరోజూ రాత్రి 7 గంటలకు నిర్వహించనున్న ఉమెన్స్ ప్రో కబడ్డీ ఛాంపియన్షిప్ కార్యక్రమానికి హాజరు కావాలని చీరాల ఎమ్మెల్యే ఎం ఎం కొండయ్యను నిర్వాహక కమిటీ సభ్యులు మంగళవారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కలిసి కార్యక్రమ వివరాలను తెలియజేశారు. ఆహ్వానం అందజేసిన వారిలో కట్టెడు వాసు, దేవరపల్లి దిలీప్ కుమార్, దేవరపల్లి దిలీప్, వడ్లమూడి సాయి, పాల్గొన్నారు. ఎమ్మెల్యే కొండయ్య కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
10.06.26 బుధవారం


# యోగాతోనే ఆరోగ్యకరమైన జీవితం

**జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత**






**(షణ్ముఖ వెలుగు, కంభం, జూన్ 9)**


యోగాతోనే ఆరోగ్యకరమైన జీవితం సాధ్యమని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత పేర్కొన్నారు. యోగాంధ్ర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కంభం చెరువు కట్టపై నిర్వహించిన ప్రత్యేక యోగా కార్యక్రమానికి భారీగా ప్రజలు తరలివచ్చారు. జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి, ఇతర అధికారులు గంటపాటు ఆసనాలు చేసి యోగ విశిష్టత, ప్రాముఖ్యతను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 5 వేల సంవత్సరాల క్రితమే రుషులు యోగా చేయడం వల్ల కలిగే అద్భుత ప్రయో జనాలను తెలియ జేశారన్నారు. యోగ ప్రాణాయామం తో ఆత్మవిశ్వాసం, ఓపిక పెరుగుతా యని వివరించారు. అదేవిధంగా జీర్ణ క్రియ, రోగ నిరోధక శక్తి, బీపీ, షుగర్ వంటి వాటికి యోగ ప్రత్యేక సాధనంగా పనిచేస్తుందన్నారు. ఖర్చు లేకుండా అందరికీ అందుబా టులో ఉండే ఆరోగ్య సాధనం ఒక్క యోగా మాత్రమేనని తెలిపారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ జీవితంలో యోగాను ప్రతి ఒక్కరు భాగం చేసుకోవాలన్నారు. కంభం చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. రాబోయే 3 నెలల్లో కంభం చెరువులో బోటు విహార యాత్రలు మొదలు పెడతామన్నారు. కూటమి ప్రభుత్వం చెప్పిన విధంగా ఇటు సంక్షేమం, అభివృద్ధిలో ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, మార్కాపురం, కనిగిరి ఆర్డీవోలు వెంకట శివరామిరెడ్డి, అజయ్ కుమార్, డీఎస్పీ నాగరాజు, విద్యుత్‌శాఖ ఎస్ఈ అబ్దుల్ కరీం, ఐసిడిఎస్ ఇన్చార్జి పీడీ పద్మావతి, డిఎల్‌డివో బాలు నాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

4

# కనిగిరి రెవిన్యూ కార్యాలయంలో అవినీతి కంపు

**బరితెగింపు**
**అక్రమ ఆన్‌లైన్‌లతో భారీ అక్రమార్జన**
**లబోదిబోమంటున్న భూ హక్కుదారులు**
**పోలీసులకు ఫిర్యాదు చేయనున్న బాధితులు**




(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జూన్ 9)

కనిగిరి రెవిన్యూ అధికారులు బరితెగించారు. కోట్ల విలువ చేసే స్థలాలను పొలాలుగా చూపి అక్రమ ఆన్‌లైన్‌కు బరితెగించారు. గజాలలో రిజిస్ట్రేషన్ అయిన స్థలాలను పొలాలుగా చూపి కనిగిరి రెవిన్యూ అధికారులు భారీగా ముడుపులు తీసుకుని అక్రమ ఆన్‌లైన్ చేశారు. అక్రమ ఆన్‌లైన్‌తో అక్రమార్కులు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. స్థలాలు కొనుగోలు చేసి బాధితులు మాత్రం దిక్కుతోచక రిజిస్టర్ కార్యాలయం, రెవిన్యూ అధికారుల చుట్టూ గత రెండు రోజులుగా తిరిగి బుధవారం పోలీసులను ఆశ్రయించనున్నట్లు బాధితులు తెలిపారు. గతంలో కూడా సర్వే నెం. 289 భూ వివాదం పై ఎస్పీ, కలెక్టర్ల దృష్టికి బాధితులు తీసుకెళ్ళి అక్రమ ఆన్‌లైన్ అడ్డుకున్నారు. కానీ అదే సర్వే నెంబర్‌ను బదిలీ పై వెళ్ళిన తహశీల్దార్ ఎన్ జయలక్ష్మి బరితెగించి అక్రమార్కులతో చేతులు కలిపిందనే ఆరోపణలున్నాయి. కనిగిరి పట్టణంలోని పామూరు రోడ్డులో 289/సి1, 289/ఏ6, 289/ఏ2 లోని య1.25ల గజాల్లోని స్థలాన్ని పంచాగ్నుల వెంకట సుబ్బయ్య పేరుతో గత శనివారం అక్రమంగా ఆన్‌లైన్ చేశారు. ఆన్‌లైన్ చేసిన ఈ స్థలాన్ని వెంకట సుబ్బయ్య తల్ల శ్రీనివాసరెడ్డికి రిజిస్ట్రేషన్ చేశారు. రిజిస్ట్రేషన్ చేసిన స్థలాన్ని ఆఘమేఘాల మీద ఆన్‌లైన్ ఎలా చేశారో కనిగిరి రెవిన్యూ అధికారులకే తెలియాలి. గతంలో ఈ స్థలాన్ని హక్కుదారుల నుండి రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఉప్పాల నరసింహారావు, తదితరులు అక్రమ ఆన్‌లైన్, రిజిస్ట్రేషన్ల విషయమై కనిగిరి రెవెన్యూ అధికారులు సబ్ రిజిస్ట్రార్‌కు మొరపెట్టుకున్నా వారి మొర ఆలకించే వారు లేరు. గత్యంతరం లేని స్థలం హక్కుదారులు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు వెలుగు ప్రతినిధికి తెలిపారు. రూ.5 కోట్ల విలువ చేసే స్థలం అక్రమ ఆన్‌లైన్‌కు 10 శాతం మేర అవినీతి సొమ్ము అధికారులకు ముట్టిందనే విమర్శలున్నాయి. ఆ సొమ్ములో కొంత జిల్లా స్థాయి అధికారులకు ముట్టజెప్పి ఆ అవినీతి తహశీల్దార్ యర్రగొండపాలెం నియోజకవర్గ కేంద్ర తహశీల్దార్‌గా బదిలీ ఉత్తర్వులు పొందడం జరిగిందనే విమర్శలున్నాయి. మార్కాపురం జిల్లా ప్రజాప్రతినిధుల ప్రమేయం లేకుండానే జిల్లాలో రెవిన్యూ అధికారుల బదిలీలు జరిగాయనే చర్చ జరుగుతోంది. కనిగిరిలో పని చేసిన ప్రతి తహశీల్దార్ భారీగా అవినీతికి పాల్పడుతున్న పరిస్థితులు కొనసాగుతున్నాయి. పర్యవేక్షించాల్సిన జిల్లా రెవిన్యూ అధికారులు అవినీతి అధికారులు అక్రమార్కులకు మంచి పోస్టింగ్‌లు ఇస్తుండడం పట్ల ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు...!

# వృత్తిలో నిబద్ధతకు సాటి...! మహిళ సేవలో మేటి...!!

**దివ్వగులకు అన్నగా...**
**ఎస్సీ, ఎస్టీ మత్స్యకారులకు వెన్నుదన్నుగా**
**ఎపిఎమ్ పెద్దసుబ్బారావు**








**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జూన్ 9)**

ఓ పూట పేట్టే అన్నం కన్న జీవితంతం చూపించే ఉపాధి మిన్న అనేలా తాను చేసే వృత్తి పట్ల అంకితభావం, నిబద్ధతతో పనిచేస్తూ మహిళా సాధికారత కై మహిళ స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేస్తూ దివ్యగులకు ఓ అన్నగా నిలబడుతూ భావితరలకు ఒక గొప్ప స్ఫూర్తిని అందిస్తున్నాడు చిన్నగంజాం మండల వెలుగు శాఖ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ (ఎపిఎమ్) జి పెద్దసుబ్బారావు. మండల వెలుగు అధికారిగా సుబ్బారావు రాకముందు సదరు శాఖ నందు అస్తవ్యస్త సమస్యలతో సతమతమవుతున్న శాఖను గాడిలో పేట్టడమే కాకుండా, సవాళ్లను ఎదుర్కొకుంటూ, క్రమశిక్షణతో పని చేస్తూ వేల కుటుంబాలకు ఆలంబనగా నిలుస్తూ తన పనితీరుతో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ మండలంగా తిర్చిదిద్దుతూ జిల్లా అధికారులు, రాష్ట్ర మంత్రులు నుండి ప్రశంసలను అందుకుంటున్నారు.

**మహిళ సేవలో మేటి....**

గతంలో వెలుగు శాఖ అనగానే కేవలం బ్యాంకుల నుండి రుణాలు అందించే ఓ శాఖగా చూసే స్థాయి నుండి (తరువాయి 4లో...)

# గంజాయి పై పోలీసుల యాక్షన్

**కందుకూరు పరిధిలో గంజాయి తీసుకునేవారు, అమ్మేవారిపై పోలీసులు యాక్షన్**



**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 9)**

కందుకూరు పరిధిలో గంజాయి తీసుకునేవారు, అమ్మేవారి పై పోలీసులు యాక్షన్ మొదలుపెట్టారు. గంజాయి వాడకం పెరగడం, దానిపై ఈమధ్య రాజకీయ విమర్శలు వచ్చిన నేపథ్యంలో పోలీసులు రంగంలోకి దిగారు. పట్టణంలో వివిధ చోట్ల పోలీసులు సోదాలు నిర్వహించి, పలువురి నుంచి 2.8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 16 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. మంగళవారం స్థానిక డిఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలు డిఎస్పీ సుబ్రహ్మణ్యం వెల్లడించారు. కందుకూరు పట్టణానికి చెందిన ఆఫ్రోజ్, వేటపాలెంకు చెందిన మరో వ్యక్తి గంజాయి అమ్ముతున్నట్లుగా తేల్చారు. పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 14 మంది గంజాయి (తరువాయి 4లో...)

# తన పై తప్పుంటే ప్రశ్నించండి

**సవాల్ విసిరిన ఎమ్మెల్యే కొండయ్య**



**(షణ్ముఖ వెలుగు, చీరాల, జూన్ 9)**

ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య చీరాలలో గడియారం సెంటర్ వద్ద మీడియా సమావేశంలో విలేకరులతో మాట్లాడిన మాటలు ప్రస్తుతం ప్రజల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఇన్నాళ్లు తన పై వచ్చిన అవినీతి ఆరోపణల పై ఎమ్మెల్యే కొండయ్య గడియారం సెంటర్ వేదికగా ఘాటుగా స్పందించారు. తాను ఎమ్మెల్యే కావాలనే సంకల్పంతో ప్రజల అభిమానంతో గెలిచానని అన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి చేసుకుంటూ పోతున్నానని అది ఓర్వలేకే తనపై తన కుమారులపై అవినీతి బురద జల్లుతున్నారని ఆయన మండిపడ్డారు. చీరాలలో పొలాల దగ్గర స్థలాల దగ్గర వ్యక్తిగతంగా జరిగే గొడవలకు తనకేమి సంబంధం అని ఎమ్మెల్యే కొండయ్య ప్రశ్నించారు. మాచర్ల మోహన్‌రావు పై దాడి జరిగితే తనకేమి సంబంధం అని ఆయన అన్నారు. గొడవ జరిగిన విషయం తెలుసుకొని వెంటనే తన మనుషులను పంపించానని ఎమ్మెల్యే కొండయ్య తెలిపారు. నియోజకవర్గంలో ఇద్దరు వ్యక్తులు కావాలనే తనపై దుష్ప్రచారానికి పాల్పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. తన గురించి నియోజకవర్గ ప్రజలకు అందరికీ తెలుసని, తనకు ఎవరితో వివాదాలు, విభేదాలు లేవని కొండయ్య స్పష్టం చేశారు. చీరాలలో ఏం నదులు ఉన్నాయని తాము ఇసుక దోచుకుంటామని, దోచుకునే సంస్కృతి తమది కాదని ఆయన తెలియజేశారు. రాజకీయంగా తన కుమారులు ఎదుగుతున్నారని అక్కసుతో పుకారులకు తెర లేపుతున్నారని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. చీరాలలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసి చూపించానని అన్నారు. తాను ఎమ్మెల్యే అయ్యాక రాజకీయపరంగా చీరాలలో ఎక్కడైనా గొడవలు జరిగాయా అని ఆయన ప్రశ్నించారు. నియోజకవర్గంలో శాంతిని నెలకొల్పి ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు తాను అహర్నిశలు పనిచేస్తున్నట్లు చెప్పారు. తుఫాన్ విపత్తు సమయంలో తనతో పాటు తన కుమారులు కూడా రాత్రింబవళ్లు పట్టణంలో తిరిగి ప్రజలకు ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకున్నామని (తరువాయి 4లో...)

## అడవి పంది అడ్డురావడంతో బైక్ ప్రమాదం-వ్యక్తి మృతి





**(షణ్ముఖ వెలుగు, కంభం, జూన్ 9)**

కంభం-గిద్దలూరు రహదారి పై అడవి పంది అడ్డురావడంతో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. కంభం ఎస్ఐ శివ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గిద్దలూరు మండలం కృష్ణమూర్తిపల్లి గ్రామానికి చెందిన బూపాని తిరుమలయ్య (44) తన వ్యక్తిగత పనుల నిమిత్తం జూన్ 8వ తేది రాత్రి కంభం నుండి గిద్దలూరు వైపు ద్విచక్ర వాహనంపై వెళుతున్న క్రమంలో నల్లకాలువ గ్రామ సమీపానికి చేరుకోగానే ఒక్కసారిగా ఓ అడవి పంది రోడ్డుపైకి రావడంతో ఆయన వాహనం అదుపు తప్పి పందిని ఢీకొట్టింది. దీంతో తిరుమలయ్య రోడ్డుపై పడిపోగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తీసుకెళ్తున్న సమయంలో మార్గమధ్యలో మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటనపై కంభం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై శివ కృష్ణారెడ్డి తెలిపారు. ప్రమాదంపై పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు వెల్లడించారు. రోడ్లపై ప్రయాణించే సమయంలో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా అటవీ ప్రాంతాలు, గ్రామీణ రహదారుల వద్ద వేగ నియంత్రణ పాటించాలని పోలీసులు సూచించారు.

## లింగసముద్రంలో ' మీకోసం ' వినియోగించుకోవాలని ప్రజలకు కలెక్టర్ పిలుపు

**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 9)**



కందుకూరు నియోజకవర్గం, లింగసముద్రం మండల కేంద్రంలో ఈ నెల 12వ తేదీన ' మీకోసం ' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే ఈ కార్యక్రమంలో కందుకూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెలలో ప్రతి శు క్రవారం ఒక నియోజకవర్గంలో 'మీకోసం' కార్యక్రమం నిర్వహించాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేసియున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 12వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు లింగసముద్రం తహసిల్దార్ కార్యాలయంలో ' మీకోసం ' కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

**చినపవనిలో పల్లెనిద్ర**

ఈ నెల 11వ తేదీ గురువారం రాత్రి లింగసముద్రం మండలంలోని చినపవని గ్రామంలో జిల్లా కలెక్టర్ ' పల్లెనిద్ర ' కార్యక్రమం ఉంటుంది. గ్రామస్తులతో కలెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడి స్థానిక సమస్యలను తెలుసుకుంటారు. రాత్రికి చినపవని గ్రామంలోనే బస చేసి శుక్రవారం ఉదయం గ్రామంలో పర్యటిస్తారు. జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయికి వస్తున్న దృష్ట్యా ఈ కార్యక్రమాల ద్వారా తమ సమస్యలను ప్రజలు పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

# వృత్తిలో నిబద్ధతకు సాటి...! మహిళ సేవలో మేటి...!!

నేడు ఎపిఎం జి పెదసుబ్బారావు కృషితో మండలంలోని వేలాది మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా రాణిస్తు వారి జీవనోపాధితో చాలమందికి ఉపాధి చూపుతున్నారు. ప్రస్తుత సంవత్సరంలో జిల్లాలోనే అత్యధికంగా రూ.45 కోట్లు రుణాలు, రూ.2.20 కోట్ల సబ్సిడీ రుణాలు అందించి మహిళలకు అన్నగా నిలిచారు. రుణాలు తీసుకుని ప్రారంభించిన వ్యాపారాలను నిత్యం పరిశీలిస్తూ వ్యాపారాభివృద్ధికి సలహాలు ఇస్తు తోడుగా నిలుస్తున్నారు.

**దివ్వగులకు అన్నగా..**

వెలుగుశాఖ అనగానే కేవలం మహిళలకే అనే గీత నుండి బయటకు వచ్చి దివ్యగులకు అన్న అయి వారికి అండగా నిలుస్తున్నారు. జిల్లాలోనే ఏ దివ్యాంగులకు అపద వచ్చినా అక్కున చేర్చుకుంటున్నారు. దివ్యాంగులకు మండల దివ్యాంగుల సమఖ్యను ఏర్పాటు చేసి వారికి ఆత్మాభిమానం పెంచేలా ప్రతి నెల 10వ తేదీన సమావేశం ఏర్పాటు చేసి వారి జీవనోపాధి పేంచేలా చేస్తున్న కృషికి గత బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి వ్యక్తిగతంగా అభినందించటం పెద్దసుబ్బారావు సేవలకు ఓ మచ్చుతునక. దివ్యాంగుల సాధారణ జీవనానికి ఇబ్బంది కలగకోడదనే ఉద్దేశ్యంలో జిల్లాలో ఏ అధికారి చేయని విధంగా రూ.2.5 కోట్లు రుణాలు, 496 దివ్వగులు, వృద్ధులకు ట్రై సైకిళ్లు, చేతి కర్రలు, చెవిటి మిషన్లు, కళ్ళజోళ్ళు, నడుం పట్టీలను ప్రాంతీయభేదంతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి దివ్యగులకు అందజేస్తున్న అంకితబావన్ని పలు ప్రముఖులు అభినందిస్తున్నారు.అన్ని వుండి



ఏమి చేయ్యలేని వాడు కడు పేదవానితో సమానం అనే ఓ నినాదంతో పెద్దసుబ్బారావు దాతల సహకారంతో ప్రతి నేల నిత్యావసర వస్తువులను దివ్యగులకు అందజేస్తున్న కృషికి పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ఎస్సీ, ఎస్టీ, మత్స్యకారులకు వెన్నుదన్నుగా..**

మండలంలోని అర్హత కల ఎస్సీ, ఎస్టీ,మత్స్యకారులను అక్కన చేర్చుకుంటూ వారిని జీవనోపాధిని అందుకునేలా 2.10 కోట్ల వడ్డి లేని మరియు మత్స్యకారులకు కోటి రూపాయల విలవైన వలలు అందిస్తు వారి కుటుంబలకు వెన్నుదన్నుగా అండగా వున్నారు.రుణాలు అందించాటనికి బ్యాంకర్లు ముందుకు రాని పరిస్థితిల్లో వ్యక్తిగతంగా బ్యాంకు మేనేజలను అభ్యర్థించి వారికి



రుణాలు,వాహనాలు, వలలు మరియు బోట్లు అందించేలా చేసిన కృషి అనిర్వచనీయం.

**వృత్తిలో నిబద్ధతకు అధికారులు, మంత్రివర్యులు ప్రశంసలు**

మండల స్వయం సహాయ సంఘల మహిళలకు అన్న, దివ్యగులకు అండగా పెద వర్గాలకు వెన్నుదన్నుగా వుంటున్న ఎపిఎమ్ జి.పెద్దసుబ్బారావు సేవలకు అధికారులు గత జిల్లా కలెక్టర్ వెంకట మురళి, రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగిగా పలు ప్రశంస పత్రాలు, అభినందనలు అందుకున్నారు. ఉత్తమ సేవలు అందిస్తు బావితరాలకు తన స్ఫూర్తిని అందించేలా చేస్తున్న నిస్వార్థ సేవను మండలంలోని పలువురు ప్రముఖులు అభినందిస్తున్నారు.

**ఎపిఎమ్ సేవలు అనిర్వచనీయం**
**వడ్లముడి వేణుబాబు**
**మండల దివ్యంగుల సమఖ్య అధ్యక్షుడు**

చిన్నగంజాం మండల దివ్యగులకు వెలుగు అధికారి పెద్దసుబ్బారావు చేస్తున్న సేవలు అనిర్వచనీయం. మండల దివ్యంగుల సమఖ్య ద్వారా రూ.2.5 కోట్లు రుణాలు, 496 దివ్వంగులకు వివిధ పరికరాలు అందించి సమాజంలో గౌరవప్రదంగా జీవించేలా స్ఫూర్తిని నింపారు.

# యోగాతోనే ఆరోగ్యకరమైన జీవితం











# వెంకటరత్నంకు పీహెచ్‌డి డిగ్రీ ప్రధానం



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 9)**

మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని శివపురిలో ఉన్న పి.కె. యూనివర్సిటీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో శ్రీ వెంకటరత్నం కోరుకొండను డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్.డి.) డిగ్రీకి అర్హుడిగా అధికారికంగా ప్రకటించింది. జూన్ 6, 2026న నిర్వహించిన పీహెచ్‌డి వైవా-వోస్ పరీక్షను విజయవంతంగా పూర్తి చేశారు. “డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఏ నవెల్ అప్రోచ్ ఫర్ ఫైల్ షేరింగ్ ఫర్ సెక్యూరిటీ యూజింగ్ బ్లాక్‌చైన్ టెక్నాలజీ”. ఈ పరిశోధనలో బ్లాక్‌చైన్ ఆధారిత పరిష్కారాల ద్వారా ఫైల్ షేరింగ్ భద్రతను మెరుగుపరిచే అంశాలపై అధ్యయనం చేశారు. కోరుకొండ తన పరిశోధనను డాక్టర్ రోహిత యమగంటి పర్యవేక్షణలో పూర్తి చేశారు. ఈ పరిశోధన బ్లాక్‌చైన్ భద్రతా సాంకేతికత మరియు ఇంజినీరింగ్ రంగాలకు విశిష్టమైన తోడ్పాటును అందించడంతో పాటు, సురక్షిత డిజిటల్ కమ్యూనికేషన్ వ్యవస్థలపై జరుగుతున్న పరిశోధనలకు మరింత బలాన్ని చేకూరుస్తున్నది. ఈ సందర్భంగా రత్నం ను పలువురు అభినందించారు.

# గంజాయి పై పోలీసుల యాక్షన్



సేవిస్తున్నట్లు గుర్తించి, అరెస్టు చేశారు. వీరిలో ఒకరు కాలేజి విద్యార్థి కాగా, మిగతా వారంతా చిన్న, చిన్న కూలి పనులు చేసుకునేవారు. గుర్రంవారిపాలెం సమీపంలోని డంపింగ్ యార్డ్, మాచవరం రోడ్డులోని పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న సెల్ ఫోన్ టవర్ ప్రాంతంలో వీరిని గుర్తించి పట్టుకున్నట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి 2.873 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కందుకూరు సిఐ అన్వర్ భాషకు వచ్చిన సమాచారం మేరకు కందుకూరు టౌన్, రూరల్, ఉలవపాడు ఎస్ఐలు, సిబ్బందితో కలిసి దాడి చేసి వారిని పట్టుకున్నారన్నారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలను రవాణా చేసే, విక్రయించే, వినియోగించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. గంజాయి, మాదకద్రవ్యాల సమాచారం ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1972, డయల్ 112, లేదా పోలీస్ వాట్సాప్ నంబర్ 9121102266 కు తెలియజేయవచ్చన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఆయన తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసిన వారిలో ఎక్కువమంది 19 నుంచి 25 సంవత్సరాలలోపు వయసున్నవారే ఎక్కువగా ఉన్నారు. పోలీసులు పట్టుకున్న తర్వాత గంజాయి తీసుకునే వారిలో తమ పిల్లలు కూడా ఉన్నట్లు తెలుసుకొని తల్లిదండ్రులు ఆశ్చర్యపోయారు. కేసును చేధించిన కందుకూరు సిఐ అన్వర్ భాష, ఎస్ఐలను జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ప్రత్యేకంగా అభినందించారు.


## తన పై తప్పుంటే ప్రశ్నించండి


ఎమ్మెల్యే కొండయ్య గుర్తు చేశారు. ఆ సమయంలో ఏ నాయకుడైనా ప్రజల వైపు తొంగి చూశాడా అని ఆయన ప్రశ్నించారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా, తన పై, కుమారులపై ఎలాంటి అసత్యపు ప్రచారాలు చేసిన చీరాలలో అభివృద్ధి ఆగదని, నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే కొండయ్య స్పష్టం చేశారు. పార్టీలు అతీతంగా ప్రజలకు సేవలు అందించడమే తన లక్ష్యమని చెప్పారు.

# ఎస్ఐఆర్ సర్వే పై అవగాహన సమావేశం

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 9)**

ఎస్ఐఆర్ సర్వే పై ఒంగోలు నియోజకవర్గ స్థాయిలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు ఆదేశాల మేరకు టిడిపి నాయకులు అవగాహన సమావేశం నిర్వహించారు. నగరంలోని పార్టీ కార్యాలయం నందు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు ఆదేశాల మేరకు క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లుకు సర్ సర్వే పై సమగ్రంగా అవగాహన కల్పిస్తూ ప్రతి ఇంటికి వెళ్లి ఓటరు జాబితాలో పేర్లు, వివరాలు సక్రమంగా నమోదయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని టీడీపీ నాయకులు సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని నగర పార్టీ అధ్యక్షులు బండారు మదన్ పిలుపునిచ్చారు. అలాగే సర్వే ప్రక్రియలో ప్రజలకు ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేస్తూ, అవసరమైన పత్రాల సమర్పణలో సహకారం అందించాలని క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జిలకు దిశానిర్దేశం చేశారు. డివిజన్ స్థాయిలో బిఎల్ఓలతో మన పార్టీ బిఎల్ఏలు పనిచేసి సర్వే విజయవంతం కావడానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కన్వీనర్లు, డివిజన్ పార్టీ అధ్యక్షులు, యూనిట్ కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు, ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.





# యోగాతో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం

## అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన జిల్లా పోలీస్‌లు

## యోగాతో ఆరోగ్యవంతమైన జీవితం

## ఒంగోలు డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 9)**

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు ఒంగోలు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం యోగా సాధన కార్యక్రమం నిర్వహించారు. యోగాంధ్ర-2026 కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ యోగా కార్యక్రమంలో ఒంగోలు డీఎస్పీ ఆర్ శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ కె శ్రీనివాసరావు, పోలీస్ అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. డాక్టర్ రాయిపాటి ప్రసాద్‌రావు, యోగా మాస్టర్లు గోపాలరెడ్డి, టి వెంకట లక్ష్మీ ప్రసన్న, అలాగే ఒంగోలు హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ సెంటర్‌కు చెందిన ఆలా మధుసూదన్, విజయలక్ష్మి లు వివిధ యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యాన పద్ధతులను వివరించారు. ఈ సందర్భంగా యోగా నిపుణులు యోగాభ్యాసం వల్ల కలిగే శారీరక, మానసిక ఆరోగ్య ప్రయోజనాలను వివరించి, పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. వారి సూచనలను అనుసరిస్తూ అధికారులు, సిబ్బంది వివిధ యోగాసనాలను సాధన చేశారు. ఈ సందర్భంగా ఒంగోలు డిఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది రోజూ విధి నిర్వహణలో ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని, అలాంటి ఒత్తిడిని తగ్గించుకొని ఏకాగ్రతను పెంచుకోవడానికి యోగాసనాలను నిత్యం జీవన విధానంలో భాగం చేసుకోవాలని, యోగా అంటే కేవలం ఆసనాలే కాదని, శరీరం, మనసు మధ్య సమతుల్యం ఏర్పరిచే గొప్ప విన్యాసాలని, ఆలోచనలకు, ఆత్మవిశ్వాసం పెంచేందుకు ఈ కార్యక్రమం ఎంతోగానో దోహదపడుతుందన్నారు. యోగాతో పోలీస్ సిబ్బంది ఆరోగ్యంగా ఉంటే వారి కుటుంబం, సమాజం కూడా బాగుంటుందని తెలిపారు. కావున యోగాని ప్రతి ఒక్కరూ తమ జీవితంలో భాగం చేసుకోవాలని, దీనిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరి పై ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు వన్ టౌన్ సీఐ వెంకటేశ్వరరావు, ఒంగోలు రూరల్ సీఐ శేషగిరి రావు, సిసిఎస్ ఇన్స్‌పెక్టర్ కమలాకర్‌రావు, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ నాగరాజు, ఆర్‌ఐ రమణారెడ్డి, సీతారామిరెడ్డి, ఎస్‌ఐలు, ఆర్ ఎస్‌ఐలు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.










# పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలి సిపిఎం డిమాండ్




**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 9)**

పెంచిన పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని కోరుతూ వామపక్షాల పిలుపు మేరకు మంగళవారం ఉలవపాడు మండల కేంద్రంలో సిపిఎం,సిఐటియు ఆధ్వర్యంలో రాస్తారోకో కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం ఉలవపాడు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జీవీబీ కుమార్ మాట్లాడారు. ఒక్కసారిగా పెట్రోల్, డీజిల్ పైన ప్రభుత్వం రూ.10 పెంచడం సిగ్గుచేటు అన్నారు. నేడు గ్యాస్ సిలిండర్ రూ.1000 నుండి 1200 అమ్ముతుందని తెలిపారు. పెరిగిన ధరలతో సామాన్య ప్రజల పై అతనపు భారం పడుతుందన్నారు. 60 రూపాయలకే పెట్రోలు, డీజిల్ ఇవ్వటానికి అవకాశం ఉన్నప్పటికీ, ప్రభుత్వాలు భారాలు వేసి, ప్రజలను నడ్డివిరవడం సిగ్గుచేటు అన్నారు. పెట్రోలు డీజిల్ ధరలబారం నిత్యావసర వస్తువులపై పడుతుందని అన్నారు. దీంతో సామాన్యుల జీవనం కష్టతరం అవుతుందని పేర్కొన్నారు. కావున ప్రభుత్వం పెంచిన పెట్రోలు డీజిల్ గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఉలవపాడు ప్రాంతీయ కమిటీ నాయకులు దువ్వూరి జాన్, కత్తి సుజాత, సిఐటియు ఉలవపాడు మండల నాయకులు ఆడేల సత్యనారాయణ, ఆటో వర్కర్స్ నాయకులు ఆలూరి దేవదాసు, సిహెచ్ మోహన్, కైకాల సుధాకర్, జరుగుమల్లి జానీ, ఆలూరి చిన్న, శెట్టిపల్లి సుకుమార్, కొత్త భాస్కర్ రెడ్డి, డొక్కా రాజేష్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలంటూ పొదిలిలో దళిత క్రైస్తవుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో భారీ ర్యాలీ












**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 9)**

మార్కాపురం జిల్లా పొదిలిలో దళిత క్రైస్తవుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని, క్రైస్తవులపై, పాస్టర్లపై, చర్చిలపై జరుగుతున్న దాడులు, హింసాత్మక చర్యలను అరికట్టాలని కోరుతూ భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. ముందుగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద వందలాది మంది క్రైస్తవ సోదర సోదరిమనులు, దళిత నాయకులు పాల్గొని డాక్టర్ బిఆర్ అంబేద్కర్, బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, అక్కడ నుంచి బయల్దేరి నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. 1950 రాష్ట్రపతి ఉత్తర్వులోని పేరా 3 ని వెంటనే రద్దు చేయాలని, మత స్వేచ్ఛ హక్కును కాపాడాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందించారు. ఎటువంటి అవంచనియా సంఘటనలు జరుగకుండా, ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఎస్ఐ రాజేష్ తన పోలీస్ సిబ్బందితో పర్యవేక్షించారు. ఈ భారీ ర్యాలీలో పొదిలి పట్టణ, పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాల గ్రామీణ ప్రాంతం క్రైస్తవులు, పాస్టర్లు, రాజకీయ దళిత నాయకులు, పెద్దలు, యువకులు, చిన్నారులు, దళిత ఐక్య వేదిక నాయకులు వందలాదిగా తరలివచ్చారు.






# కరేడు సెక్టార్‌లో కిశోర వికాసం ముగింపు కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 9)
మండలంలోని కరేడు సెక్టార్ ఇందిరానగర్ కాలనీలో మంగళవారం కిషోర్ వికాసం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కిషోర్ వికాస కార్యక్రమం అనేది మే 5వ తేదీ నుండి జూన్ 09 తేదీ వరకు నిర్వహించడం జరిగిందన్నారు. ఇది 9 అంశాల మీద కిశోరే బాలికలకు, బాలురకు ప్రతి మంగళ, శుక్రవారంలో అవగాహన ఇవ్వడం జరిగింది. ఈ తొమ్మిది అంశాల గురించి తల్లులకు, బాలురు, బాలికలకు మయిలక సారి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశాల గురించి క్షుణ్ణంగా మరో సారి 9 అంశాల గురించి తల్లులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయా, ఆశాలు, అంగన్వాడీ సూపర్వైజర్లు ఎం నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ సేవల్లో నిర్లక్ష్యానికి చర్యలు!







(షణ్ముఖ వెలుగు, వేటపాలెం, జూన్ 9)
వేటపాలెం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో మంగళవారం కిశోర్ బాలికల సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమం, అంగన్వాడీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ సాధికార అధికారి శ్రీమతి డి. రాధా మాధవి హాజరై మాట్లాడారు. అంగన్వాడీ కార్యకర్తలు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కేంద్రాలు నిర్వహిస్తూ ప్రీ-స్కూల్ నమోదు పెంచాలని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వ ఆహార పదార్థాలు సకాలంలో అందజేయాలని సూచించారు. కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఫ్యాన్ సౌకర్యాలు ఉండేలా చూడాలని చెప్పారు. అనంతరం ఐసీపీఎస్ పీఓ ప్రియ, వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది బాల్య వివాహాలు, పోక్సో చట్టంపై అవగాహన కల్పించి బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ కోసం ప్రతిజ్ఞ చేయించారు. సీడీపీఓ ఝాన్సీ అంగన్వాడీ కేంద్రాల్లో యోగా కార్యక్రమాల నిర్వహణపై సూచనలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, కిశోర్ బాలికలు, గర్భిణులు పాల్గొన్నారు.

# అభయాంజనేయ స్వామికి వైభవంగా విశేష పూజలు



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, జూన్ 9)
అధిక జ్యేష్ఠ మాసమును పురస్కరించుకొని మూడవ మంగళవారం స్థానిక శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి మరియు అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో స్వామివారికి విశేష పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు.





ఆలయ అర్చకులు వీరేశచార్యులు ఆధ్వర్యంలో అభయ ఆంజనేయ స్వామి వారికి పంచామృత అభిషేకం, తమలపాకులతో ఆకు పూజ, మరియు సింధూర అర్చన తదితర పలు రకాల విశేష పూజలను శాస్త్రోక్తంగా జరిపారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ విశేష పూజా కార్యక్రమాలకు భక్తులు దాతలుగా వ్యవహరించి స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ప్రత్యేక అభిషేక దాతలుగా కనక్కాయ శ్రీనివాసులు, వారి సతీమణి విజయలక్ష్మి కుటుంబ సభ్యులు, తులసి వెంకట శివ నారాయణ సతీమణి ఇందుమతి, గొడిసి పాటి అంకయ్య సతీమణి రుక్మిణమ్మ కుటుంబ సభ్యులకు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ గావించారు. ఆలయ ప్రాంగణం అంతా హనుమాన్ చాలీసా పారాయణాలతో, భక్తి శ్రద్ధలతో మార్మోగింది.

# గ్రామ సెక్రెటరీ ఆధ్వర్యంలో నీటి ట్యాంక్ శుభ్రం అభినందించిన ప్రజలు



(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జూన్ 9)
మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ సమీపాన ఉన్న పొట్టిశ్రీరాములు పార్క్, పక్కన ఉన్న పురాతన ట్యాంకును గ్రామ ప్రజలు త్రాగు నీటి నిమిత్తం అధికంగా ఉపయోగించుకునేవారు. ఈ క్రమంలో ట్యాంక్ అపరిశుభ్రంగా ఉండటాన్ని సెక్రటరీ గమనించడం జరిగింది. దీంతో ప్రజలు ఎక్కడ అనారోగ్యానికి గురవుతారో నని గ్రహించిన గ్రామ పంచాయితీ సెక్రటరీ కె సుధాకర్ బాబు వెంటనే కూలీల సహాయంతో ట్యాంక్ లోపల పేరుకుపోయిన చెత్తా చెదారం, మురికిని శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా పంచాయితీ సెక్రటరీ స్థానిక గ్రామ ప్రజలతో మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించే లక్ష్యంతో ట్యాంకును పూర్తిగా శుభ్రపరచి, ట్యాంకుకు సున్నం వేయించి కొత్త ట్యాంకుగా రూపు రేఖలు మార్చివేశారు. అంతే కాక ట్యాంకుకు ఉన్న పాత కొళాయిలను తొలగించి, కొత్త వాటిని కూడా త్వరలో బిగిస్తామన్నారు. తద్వారా నీరు వృథా కాకుండా అరికట్టడంతో పాటు, ట్యాంక్ నిండినప్పుడు రోడ్ల పై నీరు ప్రవహించడంతో ప్రయాణికులకు చాలా ఇబ్బందులు ఎదుర్కొనే వారన్నారు. ప్రస్తుతం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా, నీటి సరఫరాను మెరుగుపరిచేలా చేస్తామని అన్నారు. అంతేగాక పంచాయితీ కార్యదర్శి సుధాకర్, ప్రస్తుతం ట్యాంకు పై కప్పు కూడా అధ్వాన్నంగా మారిందని, దీని వల్ల నీటి కలుషితం అయ్యే అవకాశం ఉందని గుర్తించామన్నారు. దీంతో ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా, త్వరలోనే పాత పై కప్పును తొలగించి, కొత్త పై కప్పును త్వరలో ఏర్పాటు చేస్తామని ఆయన గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు. స్థానిక గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండి, మౌలికమైన ప్రాథమిక సౌకర్యాలకల్పనలో చొరవ చూపుతానని కార్యదర్శి సుధాకర్ బాబు ప్రజలతో ముచ్చటించారు. గతంలో గ్రామ ప్రజా ప్రతినిధులు పనితీరుకు ప్రస్తుత కార్యదర్శి అయిన కె సుధాకర్‌బాబు పనితీరును గమనించిన స్థానిక ప్రజలు ఆయనకు అభినందనలు తెలిపారు.

# ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

(షణ్ముఖ వెలుగు, ఇంకొల్లు, జూన్ 9)



మండల స్వయం సహాయ సంఘల సభ్యులు కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోని వారి జీవనభివృద్ధిని మేరుగు పరుచుకోవాలని పర్చూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకట్రావు అన్నారు. ఇంకోల్లు మండలంలోని స్థానిక వెలుగు కార్యాలయంలో ఎపిఎమ్ అనురాధ అధ్వర్యంలో మన డబ్బులు మన లెక్కలకు సంబంధించి మండల స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి పర్చూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకట్రావు, పిఎసిఎస్ చైర్మన్ హరి శ్రీనివాసరావు,తహశీల్దార్ లు అతిథులుగా హజరైయ్యారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎపిఎమ్ అనురాధ మాట్లాడుతూ ప్రతి సభ్యురాలికి "సూపర్ నారి" యాప్ ఇన్‌స్టాల్ చేసి సభ్యురాలు యొక్క ఎంబికె ఐడి నెంబర్‌తో లాగిన్ అయినట్లయితే సభ్యురాలు యొక్క డేటా అలాగే గ్రూప్ యొక్క వివరాలు, గ్రూపులో ఇప్పటివరకు సభ్యురాలు చేసిన పొదుపు అలాగే మొత్తం గ్రూప్ పొదుపుతో పాటు సభ్యురాలు ఇప్పటివరకు తీసుకున్న అప్పు ఎంత చెల్లించింది బ్యాలెన్స్ ఎంత ఉంది అనే విషయాలు కూడా చూసుకోవటానికి అవకాశం ఉంటుందన్నారు. వీటిలో ఏదైనా మార్పులు ఉన్నట్లయితే దానికి సంబంధించి ఫిర్యాదు నమోదు చేసుకునే అవకాశం కూడా యాప్ లో ఉంటుందని తెలిపారు. ఇప్పటి నుండి ప్రతి గ్రామంలో చిన్న సంఘాలకు సమావేశం ఏర్పాటు చేసి మన డబ్బులు మన లెక్కల పై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. పిఎసిఎస్ చైర్మన్ హరి శ్రీనివాసరావు మాట్లాడుతూ తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లిస్తూ, మరింత మొత్తంలో బ్యాంకు రుణాలను తీసుకొని అభివృద్ధి చెందాలని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో పర్చూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకట్రావు, మండల తహసిల్దార్, పిఎసిఎస్ చైర్మన్ హరి శ్రీనివాసరావు, ఎపిఎమ్ అనురాధ, సిసిలు, అన్ని గ్రామ సంఘ సహాయకులు, అకౌంటెంట్లు పాల్గొన్నారు.

# ఘనంగా ఎస్‌టియు సంఘ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

## - ఉపాధ్యాయుల ఐక్యతే మా బలం - విద్యాభివృద్ధియే మా లక్ష్యం



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, జూన్ 9)
ఎస్‌టియు 80వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎర్రగొండపాలెం మండల శాఖ ఆధ్వర్యంలో సిపిఐ కార్యాలయం ఎదురు ఎస్టీయు జెండాను రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ దేశా నాయక్, జిల్లా గౌరవ అధ్యక్షులు డి రామదాసు మాట్లాడుతూ స్వాతంత్రానికి పూర్వమే సంఘ ఆవిర్భావ ఆవశ్యకతను, ఆవిర్భావం అనంతరం సంఘం సాధించిన అద్భుత విజయాలను తెలియజేస్తూ ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హక్కుల సాధనతో పాటు, హక్కుల పరిరక్షణ, విద్యాభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం, నిరంతరం విద్యారంగ సమస్యల పై అలుపెరగని పోరాటం చేస్తూ ఎస్‌టియు చేసిన సేవలను కొనియాడారు. ఉపాధ్యాయుల మన్నలను పొందిన రాష్ట్రోపాధ్యాయ సంఘం నేడు 80వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా ఎస్టీయు నాయకులకు, కార్యకర్తలకు, ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ఎర్రగొండపాలెం మండల అధ్యక్షులు కే శామ్యూల్, ప్రధాన కార్యదర్శి డి తిరుపతి నాయక్, రాష్ట్ర, జిల్లా కార్యవర్గసభ్యులు, మండల కార్యవర్గ సభ్యులు, సిపిఐ ఎర్రగొండపాలెం నియోజవర్గ కార్యదర్శి డి రామయ్య, మార్కాపురం జిల్లా ఏఐటియుసి అధ్యక్షులు కంచర్ల వెంకట కృష్ణయ్య, ఎస్టియు ట్రైబల్ వెల్ఫేర్ (గిరిజన ప్రతినిధులు) బి అంకన్న, బై స్వామి, డి ఆత్మానంద, ప్రభాకర్, పార్థసారథి, ఆంజనేయులు, అబ్దుల్ కలాం, జీవి నరసయ్య, సతీష్ కుమార్, శ్రీనివాసులు, నాగేశ్వరరావు, తదితర ఉపాధ్యాయులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ రిలీఫ్ రూ.92 లక్షలు బాధితుల అకౌంట్లకు త్వరగా వేయాలి

## బాపట్ల జిల్లా కలెక్టర్ ను డిమాండ్ చేసిన దళిత నేత నీలం

**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జూన్ 9)**

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ రిలీఫ్ ఫండ్ ను బాధితుల అకౌంట్లకు త్వరగా జమ చేసేలా చర్యలు తీసుకోవాలని బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్ కుమారును దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. మంగళవారం బాపట్ల కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ వద్ద కలెక్టర్ ను కలిసి బాపట్ల జిల్లాకు ఎస్సీ ఎస్టీ రిలీఫ్ 92 లక్షల 60 వేలు మంజూరైనవని తెలిపారు అలాగే గతంలో పీఎఫ్ఎంఎస్ పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్మెంట్ సిస్టం ద్వారా ఎస్సీ ఎస్టీ రిలీఫ్ నిధులు బాధితులకు అందేవి అన్నారు. తహసిల్దార్ కార్యాలయాల నుండి ఆధార్ బాధితుల అకౌంట్ వివరాలు కలెక్టరేట్కు తెప్పించుకొని కలెక్టరేట్ మెజిస్టీరియల్ సెక్షన్ వారు బాధితులకు అకౌంట్లోకి డబ్బులు పంపేవారన్నారు. కానీ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సీఎఫ్ఎంఎస్ సిస్టం ప్రవేశపెట్టి ఎస్సీ, ఎస్టీ రిలీఫ్ మంజూరు విధానాన్ని క్లిష్టతరం చేసిందన్నారు. ఈ విధానంలో తహసీల్దార్ నుండి వచ్చిన బాధితుల ఆధార్ అకౌంట్ వివరాలు మెజిస్టీరియల్ సెక్షన్ వారు ఏ సెక్షన్ కు పంపవలసి ఉంటుందన్నారు. ఏ సెక్షన్ వారు ప్రతి ఎస్సీ ఎస్టీ బాధితులకు మరల ప్రత్యేకమైన అకౌంట్ నెంబరును క్రియేట్ చేసి జిల్లా ట్రెజరీ కార్యాలయానికి పంపవలసి ఉంటుందన్నారు. తరువాత ట్రెజరీ వారు వీలును బట్టి ఎస్సీ ఎస్టీ బాధితుల అకౌంట్లోకి డబ్బులు పంపిస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత నెల 26వ తేదీన 17 కోట్ల 86 లక్షల రూపాయలు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలకు ఎస్సీ ఎస్టీ రిలీఫ్ ఫండ్ రిలీజ్ చేసిందన్నారు. బాపట్ల జిల్లాలో రెండు వారాలు అవుతున్న ఎస్సీ ఎస్టీ రిలీఫ్ ఫండ్ బాధితులకు ఇచ్చే ప్రక్రియ ఏ



సెక్షన్ కు కూడా వెళ్లలేదన్నారు అంతట జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ స్పందించి ప్రభుత్వం విధానాలు సిస్టం ప్రకారమే ఎస్సీ, ఎస్టీ రిలీఫ్ పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని త్వరలో ఎస్సీ ఎస్టీ రిలీఫ్ బాధితులందరికీ వారి అకౌంట్లో డబ్బులు పడేలా చూస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ ను కలిసిన వారిలో దళిత మహాసభ అధ్యక్షులు మాచవరపు జూలియన్, మాల మహానాడు అధ్యక్ష, కార్యదర్శులు దారా అంజయ్య, కాకుమాను రవి, పత్రా బంగారం, తదితరులు ఉన్నారు.

# కేజీ బేసిన్ గ్యాస్‌లో ఆంధ్రకు సగం వాటా ఇవ్వాలి

## సిపిఎం మార్కాపురం జిల్లా కమిటీ సభ్యులు గుమ్మ బాలనాగయ్య




**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 9)**

కేజీ బేసిన్ గ్యాస్ లో ఆంధ్రకు సగం వాటా ఇవ్వాలని సిపిఎం మార్కాపురం జిల్లా కమిటీ సభ్యులు గుమ్మ బాలనాగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వామపక్షాలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్థానిక పెద్ద బస్టాండ్ సెంటర్లో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపుకు నిరసనగా రాస్తారోకో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇరాన్ – అమెరికా యుద్ధం సాకుతో ప్రజలపై కోట్లాది రూపాయల భారం మోపే విధంగా డీజిల్ ధరలు పెంచిందన్నారు. ఇటీవల భారీగా పెరిగిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరల భారం సామాన్యుల నడ్డి విరుస్తోందని ప్రభుత్వం ధరలు తగ్గించకపోతే పెద్దఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. సిపిఐ మండల కార్యదర్శి రత్నం మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీల పేరుతో కోట్లాది రూపాయలు కోటీశ్వరులకు దోచిపెడుతున్నాయని విమర్శించారు. పెద్దలకు ఇచ్చే సబ్సిడీలతో ప్రభుత్వాలు పేదలపై భారాలు మోపుతూ దోచుకుంటుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నర్రా వెంకటేశ్వర రెడ్డి, సిపిఎం పొదిలి ప్రాంతీయ కమిటీ కన్వీనర్ పిల్లి బాల నరసయ్య, సిఐటియు పొదిలి మండల కార్యదర్శి బి కోటేశ్వరరావు, శ్రీనివాసులు, ఆటో యూనియన్ నాయకులు వెంకటేశ్వర్లు, సిఐటియు నాయకులు నరసింహారావు, మహిళా కార్మికులు పాల్గొన్నారు.

# సచివాలయ సిబ్బంది డోర్ టు డోర్ ఆర్అండ్ఆర్

## ప్యాకేజీ సర్వేని నిరాకరించి నిలిపివేసిన గిరిజన యానాదులు





**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 9)**

మండలంలోని కరేడు గ్రామపంచాయతీ పరిధిలో గల (ధర్మారెడ్డి సంఘం) ఇందిరా నగర్ కాలనీ గ్రామస్తులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అనేది ఏంటో గుర్తు తెలియని వైనం. ఈ యొక్క విషయాన్ని అదునుగా తీసుకుని కొంతమంది నాయకులు గ్రామస్తులందరిని ఒక దగ్గర కూర్చుని పెట్టి విషయం తెలియజేయకుండానే 9వ తేదీ మంగళవారం కరేడు గ్రామ సచివాలయ సిబ్బందితో సర్వే నిర్వహించబోవుగా గ్రామస్తులు అందరూ కలిసి సర్వే నిలిపివేయడం జరిగింది. గ్రామస్తులందరం కలిసి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ విషయమై కుల మీటింగ్ పెట్టుకున్న పిదప మండల పరిధిలో ఎమ్మార్వో, సబ్ కలెక్టర్, ఎమ్మెల్యే కు వినతి పత్రం ద్వారా తెలియజేస్తామని గ్రామస్తులందరూ కలిసి నిర్ణయించారు.

# మండల తహశీల్దార్‌గా లక్ష్మి నారాయణ



**(షణ్ముఖ వెలుగు, పామూరు, జూన్ 9)**


పామూరు మండల తహశీల్దార్‌గా ఆనాటి లక్ష్మీ నారాయణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఖేతి బచావో అభియాన్ కార్యక్రమం

**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 9)**

కెవికె కందుకూరు శాస్త్రవేత్తలు పొలం సంరక్షణ ప్రచార కార్యక్రమాన్ని చాకిచర్ల, వంటవారిపాలెం గ్రామాల్లో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్త డాక్టర్ ఐ వెంకటేష్ మాట్లాడుతూ రైతులు సిఫారసుకు మించి రసాయన ఎరువులు వాడడం వల్ల నేల చవుడు బారి పంటలు పండడానికి పనికి రాకుండా పోతాయని చెప్పారు. కనుక భూసార పరీక్షలు ఆధారంగా ఎరువులు వేసుకోవడం వల్ల ఖర్చు తగ్గి అవశేషాలు





లేని నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. జీవన ఎరువులు, సేంద్రీయ ఎరువులు, వానపాముల ఎరువులు, కంపోస్ట్ మరియు జనము, జీలుగ, పిల్లిపెసర, ఉలవ వంటి పచ్చిరొట్ట పైర్లు తొలకరిలో వేసుకోవడం వలన సేంద్రియ కర్బణం పెరగడంతోపాటు వచ్చే ఇతర ప్రయోజనాలు రైతులకు వివరించారు. ఎల్ నినో వల్లన ఈ సంవత్సర వర్షపాతం 10% తగ్గొచ్చని తధనుగుణంగా స్వల్పకాలిక పంటలు వేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్త డాక్టర్ నిహారిక మాట్లాడుతూ కెవికేలో



మహిళలకు సాయం ఉపాధిపై శిక్షణ ఇవ్వబడుతుందని ఆసక్తిగల మహిళలు కెవికెలో తమ పేర్లను నమోదుచేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త మయాంక్ మామిడి ఎగుమతులకు తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. మండల వ్యవసాయ అదికారి విజయ్ కుమార్ మాట్లాడుతూ పచ్చి రొట్ట విత్తనాలు, జీవన ఎరువులు రైతు బరోసా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజరు షాపుద్దీన్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలి





(షణ్ముఖ







వెలుగు, ఒంగోలు, జూన్ 9)

పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని కోరుతూ సిపిఐ, సిపిఎం, సిపిఐ ఎంఎల్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా శాఖల ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండు కూడలి అయిన సాగర్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఉదయం 10.27 గంటలకు రెండు ప్రధాన మార్గాల్లోకి వచ్చి వాహన రాకపోకలను అడ్డుకున్నారు. దాంతో పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు రంగప్రవేశం చేసి ఒక మార్గంలో రాస్తారోకో చేస్తున్న వారితో ఒంగోలు వన్ టౌన్ సిఐ వెంకటేశ్వరరావు, రెండవ మార్గంలో రాస్తారోకో చేస్తున్న వారితో తాలూకా సిఐ విజయ్‌కృష్ణ మాట్లాడేందుకు ప్రయత్నించారు. ట్రాఫిక్ సమస్య పెరుగుతున్నందున వెంటనే ఆందోళన విరమించాలని సూచించారు. ఆందోళనకారులు పట్టువీడకుండా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తుండడంతో సిఐలు తమ సిబ్బందితో వారిని అక్కడ నుండి పంపించేందుకు ప్రయత్నించారు. కొంతమంది ఆందోళనకారులు పట్టు విడవకపోవడంతో వారిని బలవంతంగా లాక్కెళ్ళి పోలీసు జీపుల్లో ఎక్కించారు. ఆర్టీసీ బస్టాండు కూడలి రెండు వైపులా ఆందోళనకారులను అక్కడ నుండి పంపించి 10.52 గంటలకు ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఈ ఆందోళన కార్యక్రమాలకు సిపిఐ జిల్లా కార్యదర్శి ఆర్ వెంకట్రావు, సిపిఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు, సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి డివిఎన్ స్వామి, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకుడు ఆర్ మోహన్ నాయకత్వం వహించారు.

## ధర్మారెడ్డి సంఘంలో ప్రభుత్వం జరిపే ఇంటింటి సర్వేను తక్షణమే నిలిపివేయాలి

### సిపిఎం డిమాండ్



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 9)

ధర్మారెడ్డి సంఘం గిరిజన కాలనీలో ఇండ్లను ఖాళీ చేయించి, ఆ స్థలాన్ని అప్పనంగా ఇండోసోల్ కంపెనీకి అప్పచెప్పేందుకు ఆ సంఘంలో ప్రభుత్వం, సచివాలయ సిబ్బంది ఇంటింటి సర్వే చేయటం ప్రజా వ్యతిరేక చర్యని, ఈ సర్వే ని తక్షణమే నిలిపివేయాలని సిపిఎం ఉరవపాడు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జీవీబీ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలందరూ ఐక్యంగా ప్రభుత్వ సర్వేను అడ్డుకొని, సచివాలయ సిబ్బందిని వెనక్కి కొట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. గత సంవత్స కాలంగా మా భూములు, మా ఇండ్లను ఇవ్వమని ఇండోస్సోల్ కంపెనీ చర్యలను నిరసిస్తూ ఆందోళన జరుగుతున్న విషయం ప్రజలందరికీ తెలిసిన విషయమే. ప్రభుత్వం, కరేడు సచివాలయ సిబ్బంది, ధర్మారెడ్డి సంఘంలో కొంతమంది దళారులు ఇండోసోల్ యాజమాన్యం వేస్తున్న పర్సంటేజ్‌ల కోసం గిరిజనులను ఆ కాలనీ నుండి మరోచోటకి తరలించాలనే, చేస్తున్న చర్యలను ప్రజలందరూ ఐక్యంగా తిప్పి కొట్టారని కుమార్ పేర్కొన్నారు. ఇప్పటికైనా మండలంలోని రెవెన్యూ అధికారులు, ప్రజల అభిప్రాయం మేరకు నడుచుకోవాలని, ఇంటింటికి జరుగుతున్న సర్వేను నిలిపివేయాలని, గిరిజనుల మధ్య చిచ్చుపెట్టి, ఇండోసోల్ కంపెనీకి ఆ కాలని, ఆ కాలనీలోని ఇండ్లను అప్పజెప్పాలని చర్యలను మానుకోవాలని హితవు పలికారు. లేదంటే ప్రజల నుండి ప్రతిఘటన ఎదుర్కోక తప్పదని జివిబి కుమార్ హెచ్చరించారు.

## ప్రజల భద్రతే లక్ష్యం

### ఆర్టీసీ బస్టాండ్‌లో ఎస్ఐ శివకృష్ణారెడ్డి అవగాహన

(షణ్ముఖ వెలుగు, కంభం, జూన్ 9)



జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు కంభం పట్టణంలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని కంభం ఎస్ఐ శివకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శనివారం కంభం బస్టాండ్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా ప్రజలకు సైబర్ నేరాలు, ఆస్తి సంబంధిత నేరాలపై అవగాహన కల్పించారు. గుర్తు తెలియని ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. అలాగే చోరీలు, జేబుదొంగతనాలు, వాహనాల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు వివరించారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి, భద్రతపై విశ్వాసం కల్పించారు. ఏదైనా అనుమానాస్పద సంఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ శివకృష్ణారెడ్డి కోరారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com